సాక్షి అనకాపల్లి

ఆదివారం, 15, అక్టోబర్, 2023



పక్కాగా భూసర్వే 10లో

చందకలో కేంద్ర భూవనరుల మంత్రిత్వ శాఖ అధికారులు పర్యటించారు. విదేశీ పరిజ్ఞానంతో చేపట్టిన భూసర్వేను మెచ్చుకున్నారు.



మన్యంలో మంచు అందాలు

శీతాకాలం ప్రవేశంతో పాడేరు మన్యంలో మంచు అందాలు మురిపిస్తున్నాయి. వంజంగి హిల్స్‌కు పర్యాటకుల తాకిడి మొదలైంది.



మహోన్నత వ్యక్తి జాలాది

విశాఖ: ప్రముఖ గేయ రచయిత జాలాది రాజారావు వర్ధంతి సందర్భంగా మేయర్ హరివెంకటకుమారి నివాళులర్పించారు.

న్యూస్‌రీల్

మహిషాసుర మర్దని.. నృత్య సందడి



మద్దిలపాలెం (విశాఖ): శరన్నవరాత్రి ఉత్సవాల వేళ మహిషాసుర మర్దని నృత్యరూపకం మంత్రముగ్ధులను చేసింది. డాక్టర్ వెంపటి చిన సత్యం జయంతి ఉత్సవాల్లో భాగంగా మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నృత్యవేడుకలు ఘనంగా నిర్వహించారు. నాట్య గురువు డాక్టర్ వెంపటి చిన సత్యం జీవన సాఫల్య పురస్కారంతో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఛైర్మన్ దీపికారెడ్డిని సత్కరించారు.

పాయకరావుపేట ఎంఈవో సస్పెన్షన్

పాయకరావుపేట: విద్యార్థి మృతి ఘటనలో మండల విద్యాశాఖాధికారి కె.ఎస్.ఎన్.గాంధీని సస్పెండ్ చేశారు. ఇటీవల పట్టణంలో దుర్గానగర్ పాఠశాల ఆవరణలో శ్లాబ్ సిమెంట్ పలక పడి విద్యార్థి మరణించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో స్థానిక హెచ్ఎం కమల్ కిరణ్‌ను ఇప్పటికే సస్పెండ్ చేశారు. ఈ దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపేందుకు నర్సీపట్నం ఆర్డీవో జయరాం, డీఈవో వెంకటలక్ష్మమ్మలతో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి కమిటీ ఏర్పాటు చేశారు. వీరి దర్యాప్తులో ఎంఈవో గాంధీ కూడా బాధ్యులని తేలింది. ఎంఈవో బాధ్యతారహితంగా వ్యవహరించారని, నాడు నేడు పనుల పట్ల నిర్లక్ష్యం వహించడమే విద్యార్థి మరణానికి దారి తీసిందని విచారణ కమిటీ నిర్ధారించింది. దీంతో విద్యా శాఖ ఆర్జేడీ ఆదేశాల మేరకు శనివారం ఎంఈవోను సస్పెండ్ చేసినట్లు డీఈవో తెలిపారు.

దసరా సెలవుల్లో పాఠశాల తెరిస్తే కఠిన చర్యలు

తుమ్మపాల: దసరా సెలవుల్లో పాఠశాల తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు అనుసరించి పాఠశాలల యాజమాన్యాలు పిల్లలపై ఎటువంటి ఒత్తిడి తీసుకురాకూడదన్నారు. వర్క్ షాప్‌లు, పదో తరగతి ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు తమ దృష్టికి వస్తే అటువంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేయడమే కాకుండా క్రిమినల్ కేసుల నమోదుకు సిఫారసు చేస్తామన్నారు. ఇలాంటివి జరిగితే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నేరుగా మండల, జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. 1098 చైల్డ్ లైన్, 1092 కాల్‌సెంటర్‌కు కాల్ చేయవచ్చన్నారు.

జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షునిగా రవీంద్రనాథ్



నూతన జిల్లా వ్యవసాయఅధికారుల సంఘం

అనకాపల్లిటౌన్ : జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షునిగా డాక్టర్ వి.రవీంద్రనాథ్(ఏడీఏ చోడవరం) ఎన్నికయ్యారు. స్థానిక రింగ్‌రోడ్డు సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా పి.సత్యనారాయణ (మండల వ్యవసాయ అధికారి, సబ్బవరం), ఉపాధ్యక్షురాలిగా టి.శ్రీదేవి (ఏడీఏ, నర్సీపట్నం), సహాయ కార్యదర్శిగా బి.ఉమాప్రసాద్ (మండల వ్యవసాయ అధికారి,నక్కపల్లి), కోశాధికారిగా పి.విజేత (వ్యవసాయ అధికారి, జిల్లా వనరుల కేంద్రం) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా జిల్లాలు ఏర్పడిన తరువాత నూతన కమిటీలను రాష్ట్ర సంఘం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పై కమిటీ రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు.

వరిలో వంద శాతం 'ఈ-క్రాప్'

- ఇతర పంటల్లో 96 శాతం నమోదు
- నష్టపోయిన ప్రతి రైతుకూ అండగా ప్రభుత్వం
- జిల్లాలో 1.8 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు
- 1.42 ఎకరాల్లో వరి, 38 వేల ఎకరాల్లో ఇతర పంటలు
- మరో వారం రోజుల్లో ఈ-కేవైసీ పూర్తి చేసేలా చర్యలు



ఈ-క్రాప్ నమోదు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు

సాక్షి, అనకాపల్లి : విపత్తుల సమయంలో అన్నదాతలకు అండగా ఉండేందుకు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పంటల బీమా తీసుకొచ్చింది. ఈ-క్రాప్‌తో నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకునేందుకు అండగా నిలుస్తోంది. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆలస్యం కావడంతో ఈ-క్రాప్ నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఇప్పటికే జిల్లాలో ఖరీఫ్‌లో వేసిన పంటలకు 96 శాతంకు పైగా ఈ క్రాప్ పూర్తయింది. వీటిలో వరి పంటలో వందశాతం ఈ క్రాప్ పూర్తయింది. మిగతా పంటల్లో 96 శాతం ఈ క్రాప్ పూర్తయింది. ఈ-క్రాప్ పూర్తయిన తర్వాత ఈకేవైసీ పూర్తి చేస్తున్నారు. మరో వారం రోజుల్లో ఈ-క్రాప్‌లో నమోదైన మొత్తం పంటకు ఈకేవైసీ కూడా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్బీకేల సిబ్బంది సాయంతో చకచకా..

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాదిలో 1.8 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేయగా..వాటిలో 96శాతం ఈ క్రాప్ బుకింగ్ పూర్తయింది. లక్షా 42 వేల ఎకరాలకు గానూ లక్షా 10 వేల ఎకరాల్లో వరి పంట వేశారు. మొత్తం లక్షా 10 వేల ఎకరాల వరి పంటకు గానూ ఈ-క్రాప్ నమోదు పూర్తయింది. మిగిలిన పంటల్లో 96 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తయింది. చెరకు, కంది, మినప, పెసర, రాజ్‌మా,రాగి, తమలపాకులు, అరటి, బొప్పాయి, పైనాపిల్ తదితర పంటలు సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో 2,50,888 మంది రైతులున్నారు. సాగు చేసిన ప్రతి పంటనూ ఈక్రాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. గతేడాది పంట నమోదులో కొన్ని సమస్యలు తలెత్తడంతో వాటిని సరిదిద్దుతూ ఈ ఏడాది ప్రభుత్వం రైతు భరోసా యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్‌ఫామ్(ఆర్‌బీయూడీపీ)ను తీసుకొచ్చింది. ఇందులో ఈ-క్రాప్ అంతర్భాగంగా ఉంటుంది. జిల్లాలో 450 రైతు భరోసా కేంద్రాల్లో పనిచేసే వీఏఏ(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్), వీహెచ్ఏ(విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్), వీఎస్ఏ(విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్)లకు ఈ క్రాప్‌బుకింగ్, ఈకేవైసీ నమోదులో చురుకుగా పనిచేశారు.





ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

శరవేగంగా ఈకేవైసీ

ఈ క్రాప్ పూర్తయిన పంటల రైతులకు ఈకేవైసీ కూడా పూర్తి చేస్తున్నాం. జిల్లాలో వరిలో వంద శాతం ఈ-క్రాప్ పూర్తయినట్టే. కొన్ని మండలాల్లో వరి కాకుండా ఇతర పంటలు వేసిన రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లడం ద్వారా 4 శాతం పంటలు నమోదు చేసుకోలేదు. వారికి సమాచారం కూడా అందించాం. ఇప్పటివరకూ వారు రాలేదు. ఈ క్రాప్ పూర్తయిన వాటికి ఈకేవైసీ కూడా దాదాపు పూర్తి కావస్తోంది. మరో వారం రోజుల్లో మొత్తం ఈకేవైసీ పూర్తి చేస్తాం.

– మోహనరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

అయ్యో పాపం!

ఏ కన్నపేగుకు భారమైందో...!
ఏ తల్లి ఒడికి దూరమైందో...!
'ఆడ పిల్ల'గా పుట్టడం శాపమైందో...!!
ఇంకా బొడ్డు పేగు వేలాడుతునే ఉంది...
కన్ను తెరిచిందో లేదో నీటి పాలైంది...
చూపరులను కన్నీరు పెట్టించింది.

- పుట్టగానే నీటిపాలు
- రైవాడ కెనాల్లో బొడ్డూడని పసికందు మృతదేహం



కెనాల్ నీటిలో పసికందు మృతదేహం

కె.కోటపాడు: గవరపాలెం గ్రామం గుండా ఉన్న రైవాడ కెనాల్ మార్గంలో నీటిలో పసికందు శవమై తేలియాడుతూ కనిపించింది. శుక్రవారం రాత్రి పొలాలకు వెళ్తున్న రైతులకు కెనాల్ మార్గంలో ఉన్న మొక్కల్లో చిక్కుకున్న పసికందు మృతదేహం కనిపించింది. వారు ఈ సమాచారాన్ని గ్రామంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ నిత్యజ్యోతి, ఆశా కార్యకర్త దేవికి తెలిపారు. దీంతో వారు శనివారం తెల్లవారుజామున వచ్చి స్థానికుల సహాయంతో నీటిలో మొక్కల మధ్య చిక్కుకొని ఉన్న పసికందు మృతదేహన్ని బయటకు తీయించారు. ఆ పసికందును ఆడపిల్లగా గుర్తించారు. మృతదేహాన్ని స్థానికుల సహాయంతో ఖననం చేయించారు.

పుట్టిన గంటల వ్యవధిలోనే..

మృతి చెందిన పసికందును నీటిలో పడేశారో... లేదా ఆడపిల్ల అని వదిలించుకోవాలనుకున్నారో కానీ బొడ్డు పేగు కూడా ఉండడంతో పుట్టిన గంటల వ్యవధిలోనే ఎవరో ఈ దారుణానికి ఒడికట్టారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఘటన గవరపాలెంతో పాటు పరిసర గ్రామాల్లో కలకలం రేపింది. దేవరాపల్లి మండలం రైవాడ జలాశయం నుంచి కెనాల్ మార్గం విశాఖపట్నం వరకూ ఉంది. నీరు దేవరాపల్లి, వేపాడ మండలాల మీదుగా ప్రవహించడంతో పసికందును నీటిలో ఎక్కడ వేశారోనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ప్రశాంతంగా ఎస్ఐ మెయిన్స్ పరీక్ష

దొండపర్తి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్ ఇన్‌స్పెక్టర్ (సివిల్), రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏపీఎస్పీ) అభ్యర్థుల మెయిన్స్ తొలిరోజు రాత పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పర్యవేక్షణలో విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో అభ్యర్థులు పేపర్-1, పేపర్-2 పరీక్షలు శనివారం రాశారు. సీపీ రవిశంకర్ కేంద్రాల్లో పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. డీసీపీ-1 కె.శ్రీనివాసరావు, డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, డీసీపీ(క్రైం) జి.నాగన్నలు వారి పరిధిలో ఉన్న పరీక్షా కేంద్రాలను సందర్శించి ప్రశాంతం వాతావరణంలో పరీక్షలు జరిగేలా సిబ్బందికి సూచనలు చేశారు. ఈ పరీక్షలకు ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు నోడల్ అధికారిగా వ్యవహరించారు.



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



లారస్-2 కొత్త బ్లాక్ వద్ద మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

సాక్షి, విశాఖపట్నం/రాంబిల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 16న విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పర్యటించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శనివారం పరిశీలించారు. విశాఖలో సీఎం ప్రారంభించనున్న ఐటీ సెజ్ హిల్ నంబర్ - 2లోని ఇన్ఫోసిస్ కార్యాలయంలో ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం ఫార్మాసిటీలో కొత్తగా నిర్మించిన యూజియా స్టెరిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని, లారస్ ల్యాబ్స్‌లో నిర్మించిన అదనపు భవన సముదాయాన్ని, యూనిట్ - 2 ఫార్ములేషన్ బ్లాక్‌ను, ఎల్.ఎస్.పి.ఎల్ యూనిట్ - 2ను పరిశీలించారు. వీటిని సీఎం జగన్ ప్రారంభించనున్నారు. అనకాపల్లి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి, ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ (తేజ), యలమంచిలి నియోజకవర్గ పరిశీలకుడు రొంగలి జగన్నాథం, రెవెన్యూ, పోలీస్ అధికారులు మంత్రి వెంట ఉన్నారు.

రేపు 'స్పందన' లేదు

తుమ్మపాల : జిల్లాలో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో ఈనెల 16న జరగనున్న జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నిర్వహించడం లేదని డీఆర్వో బి.దయానిధి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పందనకు హాజరయ్యే అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి సోమవారం స్పందన కార్యక్రమానికి రావద్దని కోరారు.

బస్సు యాత్రను విజయవంతం చేద్దాం

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



పార్టీ ముఖ్యనాయకులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో అందించిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించడానికి ఏర్పాటు చేసే సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఎండాడ లా కాలేజీ సమీపంలో గల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో తొలి విడత 'సామాజిక బస్సు యాత్ర' ప్రారంభం కానునందన్నారు. ఈ నెల 28న భీమిలిలో, వచ్చే నవంబర్ 6న గాజువాకలో బస్సుయాత్ర సాగనుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యేలు తిప్పలనాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, సమన్వయకర్తలు కె.కె రాజు, ఆడారి ఆనంద్‌కుమార్, జిల్లా వైఎస్సార్‌సీపీ కమిటీ వైస్ ప్రెసిడెంట్ దామా సుబ్బారావు, డిప్యూటీ మేయర్లు కె.సతీష్, జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, పార్టీ ముఖ్యనేత గొలగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో 'పవర్' ఫుల్

- రూ.3.5 కోట్లతో తారువలో నూతన సబ్ స్టేషన్
- డిప్యూటీ సీఎం చొరవతో తీరనున్న కరెంటు కష్టాలు
- ఇళ్లు, వ్యవసాయ కనెక్షన్లకు నాణ్యమైన విద్యుత్
- లో ఓల్టేజీ సమస్యకు చరమగీతం
- టెక్నికల్ చార్జింగ్ టెస్ట్ పూర్తి చేసిన అధికారులు
- అతి త్వరలో సబ్‌స్టేషన్ ప్రారంభం



తారువలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్

దేవరాపల్లి: తారువలో నూతనంగా నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రంతో దేవరాపల్లి మండలానికి కరెంట్ కష్టాలు తీరనున్నాయి. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవతో ఎన్నో ఏళ్లుగా మండల ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల నుంచి మోక్షం లభించనుంది. సరఫరాలో అంతరాయం, లో ఓల్టేజీ కారణంగా ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో తారువలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.3.5 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను నెలల వ్యవధిలో యుద్ధప్రాతిపదికన చేపట్టారు. త్వరలోనే ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ఇటీవల సబ్ స్టేషన్‌లో టెక్నికల్ చార్జింగ్ టెస్ట్ సైతం నిర్వహించారు.

నూతన సబ్ స్టేషన్‌తో ప్రయోజనం ఇలా...

మండలంలో దేవరాపల్లి, బోయిలకింతాడ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 20 వేలు ఇళ్ల కనెక్షన్లు, 1800 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. ఈ రెండింటికీ మధ్య తారువలో సబ్‌స్టేషన్ ఏర్పాటుతో వీటిపై లోడ్ తగ్గనుంది. దీంతో మండలంలోని అన్ని గ్రామాలకు లో ఓల్టేజీతో పాటు విద్యుత్ అంతరాయం సమస్యకు పరిష్కారం లభిస్తుంది. దేవరాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని తారువ ఫీడర్ నుంచి గరిశింగి శివారు గిరిజన గ్రామాలకు సైతం విద్యుత్ సరఫరా చేస్తుండటంతో.. ఇప్పటి వరకు అక్కడ చిన్నపాటి సమస్య ఏర్పడినా తారువ సహా పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడేది. ఇప్పుడా సమస్య ఉండదు.



విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

తారువకు 24 గంటలు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా

కొత్త సబ్‌స్టేషన్ నుంచి తారువతోపాటు తిమిరాం, వాకపల్లి, చీడికాడ మండలం నీలంపేట, కొత్తూరు, చీడిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా చేయనున్నారు. తారువకు 24 గంటలు త్రీ ఫేజ్ కరెంట్ సరఫరా అందుబాటులోకి రానుంది. తారువలో సబ్‌స్టేషన్ మంజూరు చేయించి మండలంలోని ఇళ్లు, వ్యవసాయ కనెక్షన్లకు లో ఓల్టేజీ సమస్యను తీర్చిన డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడుకు మండల ప్రజలు, రైతులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా



తారువ విద్యుత్ ఉపకేంద్రంతో మండలంలోని అన్ని గ్రామాలకు, చీడికాడ మండలంలోని కొన్ని గ్రామాలకు లో ఓల్టేజి, విద్యుత్ అంతరాయం సమస్యలు తీరుతాయి. తారువ పరిసర గ్రామాలలోని వ్యవసాయ కనెక్షన్లకు తారువ రూరల్ ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తాం. డిప్యూటీ సీఎం చొరవతో నిర్మించిన నూతన సబ్‌స్టేషన్‌తో ప్రస్తుతం ఉన్న సబ్‌స్టేషన్లపై లోడ్ తగ్గి నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది.

–కె.శంకరరావు, ఎలక్ట్రికల్ ఏఈ, దేవరాపల్లి

బైక్‌పై నుంచి జారిపడి మహిళ మృతి

మాకవరపాలెం: మండలంలో సుభద్రయ్యపాలేనికి చెందిన కన్నూరు లక్ష్మి(43) బైక్‌పై వెనుక కూర్చుని జారిపడి శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ రామకృష్ణారావు శనివారం తెలిపారు. ఆమె మాకవరపాలెం నుంచి తన స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదానికి గురైందని, తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విదేశీ పరిజ్ఞానంతో పక్కాగా భూసర్వే

- చందకలో కేంద్ర భూవనరుల మంత్రిత్వ శాఖ అధికారుల పర్యటన
- క్షేత్ర స్థాయిలో డ్రోన్ సర్వేను పరిశీలించిన బృందం సభ్యులు
- సంతృప్తి వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కితాబు


మ్యాప్‌ల గురించి అజయ్ టిర్కీ తదితరులకు వివరిస్తున్న జేసీ విశ్వనాథన్

ఆనందపురం : రాష్ట్రంలో విదేశీ పరిజ్ఞానంతో శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం సర్వే కచ్చితమైన కొలమానంతో జరుగుతోందని కేంద్ర భూ వనరుల మంత్రిత్వ శాఖ అధికారుల బృందం, ఉత్తరాది రాష్ట్రాల అధికారుల ప్రతినిధుల బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డుల మోడ్రనైజేషన్‌లో భాగంగా నగరంలో శుక్రవారం జరిగిన ప్రాంతీయ సదస్సులో పాల్గొన్న కేంద్ర గ్రామీణాభివృద్ధి, భూవనరుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి అజయ్ టిర్కీ, సంయుక్త కార్యదర్శి సోన్మోని బోరా తదితర అధికారుల బృందం శనివారం ఆనందపురం మండలం చందక రెవెన్యూ గ్రామ పరిధి జగ్గరాజుపాలెంలో పర్యటించింది. ముందుగా భూసర్వేకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు. ప్రదర్శనలో ఉంచిన పాత రికార్డులు, మ్యాప్‌లతో పాటు రీసర్వే అనంతరం కొత్తగా రూపొందించిన రికార్డులు, మ్యాప్‌లను పరిశీలించారు. భూ రీసర్వేలో పాత, కొత్త భూవిస్తీర్ణాలకు సంబంధించి ఒక శాతం మించి తేడా రాలేదని అధికారుల బృందానికి సర్వే అధికారులు వివరించారు. సర్వే మూలంగా ఎక్కడైనా అభ్యంతరాలు ఉంటే రైతుల వినతి మేరకు మళ్లీ సర్వే నిర్వహించి, సరిచేసి అప్పగించామన్నారు. అనంతరం డ్రోన్ సర్వే విధానాన్ని ప్రత్యక్షంగా పరీక్షించారు. సర్వే కోసం వినియోగించిన పరికరాల వివరాల కోసం ఆరా తీశారు.

రైతులతో ముఖాముఖి

పరిశీలన బృందం సభ్యులు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ టిర్కీ మాట్లాడుతూ అధికారులు నిజంగానే క్షేత్ర స్థాయికి వచ్చి సర్వే చేశారా? లేదా రికార్డుల్లోనే చూపిస్తున్నారా? అలాగే రీసర్వేలో భూ విస్తీర్ణాల్లో తేడా వస్తే ఎలాంటి చర్యలు తీసుకున్నారు అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అంతా పారదర్శకంగానే జరిగిందని, అన్ని వివరాలను అధికారులు స్వయంగా తెలియజేసి రీసర్వేలోని వివరాలతో కొత్త రికార్డులను రూపొందించారని తెలిపారు. దీంతో కేంద్ర బృందం సభ్యులు, దక్షిణాది రాష్ట్రాల అధికారుల బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ విభాగం కమిషనర్ సిద్ధార్థజైన్, సీసీఎల్‌ఏ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్, జేసీ కె.ఎస్.విశ్వనాథన్, ఆర్డీవోలు అహ్మద్, భాస్కర్‌రెడ్డి, తహసీల్దారు రామారావు, సర్పంచ్ బంక శ్రీను, వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, పాలూరి బంగారునాయుడు పాల్గొన్నారు.

చాలా ఏళ్లనాటి సమస్యలకు మోక్షం

తాతల దగ్గరి నుంచి భూములు సాగు చేసుకుంటున్నా ఉమ్మడి కుటుంబాల వల్ల భూహక్కులు సమస్యలు తలెత్తాయి. దీంతో సాగు చేసుకోవడం తప్ప హక్కులు మాత్రం సంక్రమించలేదు. జగనన్న శాశ్వత భూహక్కు పథకంలో భాగంగా అధికారులు సర్వే చేసి ఎవరి సాగులో భూములు ఉంటే వారికే హక్కులు కల్పించడంతో వ్యవసాయపరమైన పథకాలకు అర్హులమయ్యాం. చాలా కాలంగా ఉన్న భూ తగాదాలకు పరిష్కారం లభించింది.

– తిమనాన పార్వతి, జగ్గరాజుపాలెం గ్రామం

డిప్యూటీ సీఎం దృష్టికి వెలమ సమస్యలు


డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుతో వెలమ సంఘం ప్రతినిధులు

దేవరాపల్లి: మండలంలోని తారువ క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ బూడి ముత్యాలనాయుడును అనకాపల్లి వెలమ సంఘం ప్రతినిధులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనకాపల్లి వెలమ సంఘం అధ్యక్షుడు కె.సోమేశ్వరరావు, వెలమాంధ్ర ఫౌండేషన్ చైర్మన్ ఎంవీఆర్ మూర్తి, సంఘ ప్రతినిధులు ఎం. ఈశ్వరరావు, కె. వాసు తదితరులు వెలమ జాతి అభివృద్ధి, సంక్షేమంతో పాటు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వీటి పట్ల సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

30 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం


బియ్యంతో పట్టుబడిన లారీ

అనకాపల్లి టౌన్: అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యాన్ని శనివారం రాత్రి పౌర సరఫరాల అధికారి మూర్తి స్వాధీనం చేసుకున్నారు. యలమంచిలి నుంచి ఒడిశా రాష్ట్రం కొరాపుట్టుకు స్థానిక జాతీయ రహదారి మీదుగా లారీలో 30 టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు యలమంచిలి మిల్లు యజమానులు వి.ఎల్.లక్ష్మీనారాయణ, బాధపు దొర, లారీ డ్రైవర్ రాజు, మిల్లులో పని చేస్తున్న సతీష్‌లను అదుపులోకి తీసుకుని, లారీతోపాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీఐ దాడి మోహనరావును కోరారు.

ఉపమాకలో ప్రత్యేక పూజలు

- స్వామివారిని దర్శించుకున్న నాగసాధువులు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు

నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. కొండపై స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, దిగువన ఉత్సవమూర్తులకు నిత్యార్చనలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కలిగించారు. రెండో శనివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉత్తర దేశ యాత్రకు వెళ్తున్న పలువురు నాగ సాధువులు, దిగంబరులు వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో వెయ్యి మందికి దాతల సహకారంతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

దుర్గాదేవీ నమోస్తుతే

- శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం
- నేటి నుంచి ప్రత్యేక అలంకరణలు, కుంకుమ పూజలు
- ఆలయాల్లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు

శరన్నవరాత్రి ఉత్సవాలకు జిల్లాలోని దుర్గాదేవి ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు, మాలధారణ చేయనున్నవారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కుంకుమ పూజలు, హోమాలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఆదివారం నుంచి విజయదశమి వరకు అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

అనకాపల్లిటౌన్: పట్టణంతోపాటు మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక, గవరపాలెం శతకంపట్టు కనకదుర్గ, వాసవీ కన్యకాపరమేశ్వరి, కామాక్షిదేవి, గౌరీ పంచాయతన ఆలయం, మండలంలో సత్యానారాయణపురం గ్రామంలోని కనకదుర్గ ఆలయాల్లో నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేలాదిమంది భక్తులు అమ్మవారి మాలధారణ చేసి, ఈ తొమ్మిదిరోజుల పాటు దీక్ష చేపడుతుంటారు. అటువంటి వారందరూ ఆదివారం తెల్లవారుజాము 3 గంటల నుంచి అమ్మవారి దీక్షలు చేపట్టేందుకు దగ్గరలో గల ఆలయాల్లో అన్నీ సిద్ధం చేసుకున్నారు.

నూకాంబిక ఆలయంలో..

నూకాంబిక ఆలయంలో నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి గణపతిపూజ, పుణ్యాహవాచనం, నిత్యసంకల్పం, రక్షాసూత్రధారణ, రుత్విక్వరుణం, అఖండదీపారాధన, నవదుర్గపీఠ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, హోమాలు, భేరీపూజ, దిగ్బలి, పతాకప్రతిష్ఠ, నీరాజన మంత్రపుష్పాలు వంటి కార్యక్రమాలు జరగనున్నాయి. ఉదయం 8.49 నిమిషాలకు కలశస్థాపన, సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చనలు, నీరాజనమంత్రపుష్పాలు నిర్వహించనున్నారు.16న రుద్రాభిషేకం, దీపాలంకరణసేవ. 17న మన్యుపాశుపతాభిషేకం, మన్యుహోమం. 18న చండీహోమం, 19న నవకళశస్థాపన, శ్రీచక్రానికి పంచామృతాభిషేకం, ఊంజల్‌సేవ. 20న సరస్వతీ అలంకరణ, సరస్వతీపూజ, 21న సహస్రకళశార్చన, తోమాలసేవ. 22న అమ్మవారి బాలాయంలో ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం. 23న శమీపూజ (ఆయుధపూజ), 24న పూర్ణాహుతి, ఆవబథస్నానం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో...

15న అమ్మవారు గాయత్రీ అలంకరణ దర్శనమివ్వనున్నారు. అదేరోజు అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని బృందం సభ్యులు భక్తిసంకీర్తనలు ఆలపించనున్నారు. 16న సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిస్తారు. ఈ సందర్భంగా సరస్వతీపూజ నిర్వహించనున్నారు.17న ధనలక్ష్మి, 18న అన్నపూర్ణాదేవి, 19న రాజరాజేశ్వరి దేవి, 20న శ్రీవ్యాఘ్రదేవి, 21న భద్రకాళీ, 22 మహిషాసుర మర్దని అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తారు, 23న కన్యకాపరమేశ్వరి నిత్యరూపంలో దర్శనమిస్తారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో , కూచిపూడి, జానపద నృత్యప్రదర్శన, సుందరాకాండ పారాయణం, కోలాటనృత్యప్రదర్శన, కన్యకలపూజ, వేదపారాణం, సుహాసినుల పూజ, భక్తి సంకీర్తనలు, కూచిపూడి నృత్యప్రదర్శన, లక్ష రూపాయి కాసులతో అమ్మవారికి అర్చన, నవదుర్గా అలంకరణ, భరతనాట్య ప్రదర్శన కూచిపూడి నృత్యప్రదర్శన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


అనకాపల్లి నూకాంబిక బాలాలయంలో అమ్మవారు

కామాక్షిదేవి ఆలయంలో...

అమ్మవారి ఆలయంలో ఈనెల15న అమ్మవారి నిలుపోత్సవం, 22న కామాక్షిదేవి అమ్మవారి సారె ఊరేగింపు, 25న భారీ అన్నసమారాధన, అమ్మవారి అనుపు ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారు. గౌరీ పంచాయతన దేవాలయం, కనకదుర్గమ్మ ఆలయాల్లో ఈనెల 15 నుంచి 22వ తేదీ వరకు వివిధ అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తారు.23న అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, నిజరూప దర్శనభాగ్యం కల్పిస్తారు.

కశింకోట కనకదుర్గమ్మ ఆలయంలో

కశింకోట: మండల కేంద్రం కశింకోట వద్ద జాతీయ రహదారి పక్కన గల కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఆదివారం నుంచి పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. నియోజకవర్గంతోపాటు బుచ్చియ్యపేట, రావికమతం, మునగపాక, అచ్యుతాపురం మండలాల గ్రామాల నుంచి భక్తులు వచ్చి ఆలయం వద్ద మాలధారణ చేస్తారు. భారీ సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుంటారు. తల నీలాలు సమర్పించడంతో పాటు చీరలు,రవికెల, అరటి గెలల రూపాల్లో మొక్కులు చెల్లించుకుంటారు. ఈ సందర్భంగా భక్తులకు ఉచిత దర్శనం, ప్రసాద వితరణ, మాలధారణ నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపకుడు నడిగట్ల ప్రసాద్‌బాబు తెలిపారు. మొదటి రోజు బాల త్రిపుర సుందరీదేవి, 16న గాయత్రీదేవి, 17న అన్నపూర్ణదేవి, 18న మహాలక్ష్మి దేవి, 19న మహాచండీ, 20న సరస్వతీదేవి, 21న లలితా త్రిపురసుందరి, 22న దుర్గాదేవి, 23న మహిషాసురమర్దని, రాజరాజేశ్వరి దేవి అలంకారాల్లో అమ్మ వారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఈ నెల 17న అన్న సమారాధన నిర్వహించనున్నట్టు చెప్పారు. రేజేటి శ్రీరామాచార్యులు పర్యవేక్షణలో కార్యక్రమాలు జరుగుతాయని, ఉత్సవాల విజయవంతానికి భక్తులు సహకరించాలని ప్రసాద్‌బాబు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నుంచి తొమ్మిది రోజుల పాటు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. మండపాలు ఏర్పాటు చేసి దుర్గాదేవి విగ్రహాలు నెలకొల్పి ఉత్సవాలు నిర్వహించనున్నారు. కశింకోటలోని పెద్ద బజారు, పూసర్ల వీధి, గవరపేట, గోవిందరావు కాలనీ, హౌసింగ్ కాలనీ, అమరపల్లి వీధి, కస్పావీధి, సత్తెమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో మండపాలు ఏర్పాటు చేశారు. బయ్యవరం, తాళ్లపాలెం, జమాదులపాలెం, ఉగ్గినపాలెం, చింతలపాలెం, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, సోమవరం, ఎఎస్ పేట, అచ్చెర్ల, జి.భీమవరం, కన్నూరుపాలెం , తీడ తదితర గ్రామాల్లో కూడా అమ్మ వారి ఉత్సవాలు నిర్వహించడానికి సన్నాహాలు చేశారు.



కశింకోట జాతీయ రహదారి పక్కన ఉన్న కనక దుర్గమ్మ ఆలయం (ఇన్‌సెట్) కనకదుర్గమ్మ అమ్మవారు

సబ్బవరం దుర్గమాంబ ఆలయంలో..

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని శ్రీదుర్గమాంబ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అమ్మవారి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి శోభాయమానంగా ముస్తాబు చేశారు. అమ్మవారికి ప్రతి రోజు ఉదయం,సాయంత్రం కుంకమ పూజలు,సహస్రనామార్చనలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

దేవీపురంలో..

ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని శ్రీ సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో ఈ నెల 15 నుంచి 28వ తేదీ వరకూ దసరా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్టు గురుమాత అన్నపూర్ణమ్మ శనివారం తెలిపారు. ఏటా ఆశ్వీయజ శుద్ధ ఏకాదశి నుంచి పౌర్ణమి వరకూ 14 రోజుల పాటు ఈ దసరా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.మహాకాళీ,మహాలక్ష్మి, మహా సరస్వతీ దేవతల సమష్టి స్వరూపిణి అయిన శ్రీచండీగా అమ్మవారిని దసరా బ్రహ్మోత్సవాల్లో కొలిచే భాగ్యం దేవీపురంలో భక్తులకు కలుగుతుందన్నారు.

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు అమ్మవారికి క్షీరాభిషేకం,కుంకుమ పూజలు,హోమాలు నిర్వహిస్తారు.
- లలితా సహస్ర నామావళి పారాయణం,దుర్గా సప్తశతి పారాయణం, దేవీ అథర్వశీర్షం పారాయణం,ఖడ్గాది పంచాదశ మాల పారాయణం నిర్వహిస్తారన్నారు.
- ఈ నెల 22న విశేష సేవలైన లలితా సహస్ర నామావళితో కుంకుమార్చన, చండీ సప్తశతి పారాయణ,ఈ నెల 28న దేవీ కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.


గవరపాలెం శతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయం


గవరపాలెం శతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణ


దేవీపురంలో కొలువైన సహస్రాక్షి రాజరాజేశ్వరీ అమ్మవారు

క్లుప్తంగా

వాసవీక్లబ్ అధ్యక్షుడిగా సత్యనారాయణ


నూతన కమిటీతో క్లబ్ సీనియర్ సభ్యులు

అనకాపల్లిటౌన్: అనకాపల్లి వాసవీక్లబ్ అధ్యక్షుడిగా కె.వి.సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలో శనివారం ఎన్నికలు జరిగాయి. క్లబ్ కార్యదర్శిగా బిళ్లపాటి గణేష్ గంగరాజు, కోశాధికారిగా దంగేటి సత్యనారాయణ(మామాజీ)లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కె.వి.సత్యనారాయణ మాట్లాడుతూ క్లబ్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తామన్నారు. 2024లో క్లబ్ ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులతో చర్చించనున్నట్టు తెలిపారు.

నేడు ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం

తుమ్మపాల: ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం నిర్వహించనున్నట్టు జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి శనివారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చేతుల పరిశుభ్రతపై ప్రజల్లో క్షేత్రస్థాయిలో అవగాహన కలిగించేలా ర్యాలీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

నేడు ఆంధ్ర పద్యకవితా సదస్సు

అనకాపల్లిటౌన్: స్థానిక వివేకానంద ఫంక్షన్ హాల్లో ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఆంధ్రపద్యకవితా సదస్సు నిర్వహించనున్నట్టు సదస్సు జిల్లా అధ్యక్షుడు మెరుగుమిల్లి వెంకటేశ్వరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీ కె.వి.సత్యవతి పాల్గొనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

పోటీలకు ఏర్పాట్లు


ఖోఖో పోటీలకు ముస్తాబైన మైదానం

పాయకరావుపేట : సి.బి.ఎస్.ఈ. క్లస్టర్ -7 ఖోఖో పోటీలు నేటి నుంచి (15,16,17) తేదీలలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో జరగనున్నాయని విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి తెలిపారు. పోటీలకు ఆంధ్రా, తెలంగాణా సీబీఎస్ఈ పాఠశాలల నుంచి సుమారు 100 టీమ్‌లు, 1200 మంది విద్యార్థులు అండర్ 19 బాలుర, బాలికల విభాగంలో పాల్గొననున్నారని ఆయన తెలిపారు. ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు.

అనకాపల్లి సినిమాలు

మ్యాడ్	: రాజా
స్కంద	: సత్యనారాయణస్క్రీన్-1
మంథ్ ఆఫ్ మధు	: సత్యనారాయణస్క్రీన్-2
మామా మశ్చీంద్ర	: షిర్డిసాయి
రూల్స్ రంజన్	: పర్తిసాయి
ది ఎక్సార్సిస్ట్: బిలీవర్	: వెంకటేశ్వర
800	: శ్రీసత్య
చంద్రముఖి-2	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 950 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,450	4,650
రెండో రకం	3,850	4,480
మూడో రకం	3,700	4,080

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 62 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-23 యూనిట్లు, బి పాజిటివ్-16 యూనిట్లు, ఒ పాజిటివ్-18 యూనిట్లు, ఒ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(ఫోన్ నంబర్ 9703619706) సంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 395 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 343 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

నూకాంబిక అమ్మవారికి ఘనంగా అమావాస్య పూజలు

అనకాపల్లిటౌన్: అన్నిదానాలు కన్న అన్నదానం గొప్పదని నూకాంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ అన్నారు. గవరపాలెం అమ్మవారి ఆలయం వద్ద ఆదిబాబు అమావాస్య యూత్ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి శుక్రవారం ఘనంగా అమావాస్య పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది దసరా నవరాత్రులను పురస్కరించుకుని నూకాంబిక అమ్మవారికి అమావాస్య పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కంభంపాటి భాను దంపతులు బూరెలు, వడలు, పులిహోర, పరమాన్నం, అరిసెలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించినట్టు ఆయన చెప్పారు. అమ్మవారికి ఉపారం పెట్టిన అనంతరం దాతలు పిళ్లా తారకేష్, బుదిరెడ్డి నాగరాజు, జగడాల పురషోత్తం సహకారంతో మధ్యాహ్నం 1200 మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కొణతాల మురళీకృష్ణ ప్రారంభించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, భోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు, ధర్మకర్తలు పీలా లక్ష్మీశ్రీనివాస్, కొండూరు రవీంద్రనాథ్, బుద్ధ నరసింగరాజు, మల్లవరపు ఈశ్వరరావు, ఎం .శ్రీనివాసరావు, కాండ్రేగుల నాయుడు పాల్గొన్నారు.

భారీ ఎత్తున అన్నసమారాధన

అనకాపల్లిటౌన్: మహాలయ అమావాస్యను పురస్కరించుకుని స్థానిక మెయిన్‌రోడ్డులోని శ్రీ సిద్ధిలింగేశ్వరస్వామి దేవాలయంలో వాసవీ స్వయం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దేవాలయం చైర్మన్ సుదురుపాటి తాతాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏడాదికి రెండుసార్లు దేవాలయంలో అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్తీకమాసంలో సిద్దలింగేశ్వరస్వామి ఆలయంలో గోకర్ణేస్వారస్వామికి ప్రత్యేకపూజలు జరపనున్నట్టు చెప్పారు. శరన్నవరాత్రుల సందర్భంగా దేవాలయంలో కాశీఅన్నపూర్ణదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.


ఉపారం తీసుకువెళుతున్న కొణతాల మురళీకృష్ణ, కంభంపాటి భాను దంపతులు

'జగనన్న ఆరోగ్య సురక్ష' ఏర్పాట్ల పరిశీలన

కశింకోట: మండలంలోని కొత్తపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహణ ఏర్పాట్లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎ.హేమంత్ శనివారం పరిశీలించారు. ఈ నెల 17న ఇక్కడ శిబిరం జరగనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య సలహాదారు సమీర్‌శర్మ శిబిరానికి హాజరై పరిశీలించనున్నట్టు సమాచారం అందింది. ఈనేపథ్యంలో శిబిరం ఏర్పాటు చేయడానికి ముందుగా నిర్ణయించిన ప్రాథమిక పాఠశాల ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ స్థలం తక్కువగా ఉన్నందున, శిబిరాన్ని పక్కనున్న హైస్కూలులోకి మార్పు చేయాలని అధికారులకు సూచించారు. దీంతో అందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నడవలేని స్థితిలో ఉన్న రోగులను శిబిరానికి తీసుకు రావడంలో గ్రామ వలంటీర్లు శ్రద్ధ వహించాలని హేమంత్ సూచించారు. అవసరమైన వారికి ఆటోలు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. డీఎల్‌డీవో మంజులావాణి, ఈవోఆర్డీ సోమరాజు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ శివ, వైఎస్సార్ సీపీ నాయకుడు అద్దెపల్లి శ్రీనివాసరావు, ఏఎస్ఎం ఉమా, ఎంఎల్‌హెచ్‌టీ దివ్య తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హేమంత్

జోరుగా జల్‌జీవన్ పనులు


పైపులైన్ నుంచి ఇంటింటి కుళాయిల పాయింట్లు ఇస్తున్న సిబ్బంది


శివాలయం ప్రాంతంలో ఇప్పటికే ఇచ్చిన ఇంటింటి కుళాయి కనెక్షన్లు

కశింకోట: జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా మండలంలోని వెదురుపర్తి గ్రామంలో పైప్‌లైన్ పనులు జోరుగా సాగుతున్నాయి. రూ.30 లక్షల వ్యయంతో గ్రామంలో 558 ఇళ్ల వద్ద కుళాయిలు ఏర్పాటు చేయడానికి వీధుల్లో కాలువలు తవ్వి పైపులైన్ వేస్తున్నారు. దీని నుంచి ఇంటింటి కుళాయిల పాయింట్లు ఇస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో కనెక్షన్లు ఏర్పాటు చేశారు. మిగతా చోట్ల కూడా త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదేశాల మేరకు అధికారులు శరవేగంగా పనులు నిర్వహిస్తున్నారు. పైపులైన్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి, ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తామని స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పావని తెలిపారు.

నేడు మార్కెట్‌యార్డు ప్రారంభం

మునగపాక : మేజర్ పంచాయతీ మునగపాకలో రూ.35లక్షల వ్యయంతో నిర్మించిన మార్కెట్‌యార్డును ఆదివారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మునగపాక సంతబయిల వ్యాపారులకు అనువుగా ఉండేలా లారస్ ల్యాబ్స్ ఆర్థిక సహకారంతో మార్కెట్‌యార్డులో షెడ్లు ఏర్పాటు చేశారు.మధ్యాహ్నం 12 గంటలకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు అతిథిగా హాజరుకానున్నారు. లారస్ ల్యాబ్స్ సీఈవో డాక్టర్ చావా సత్యనారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా కోలాటం, చిటికల భజన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అప్పారావు కోరారు.

ఏకాగ్రతతో పోటీ పరీక్షల్లో రాణింపు

మునగపాక : విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుని పోటీ పరీక్షల్లో రాణించాలని విశ్రాంత డీఈవో శిష్టా తమ్మిరాజు కోరారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్ఎంఎంఎస్ ఉచిత శిక్షణ తరగతులను ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడారు.

ఏటా క్రమం తప్పకుండా సంస్థ ఆధ్వర్యంలో తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోర్సు డైరెక్టర్ ఎం.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. సంస్థ సభ్యులు కె.వి.రమణ, కొణతాల సోమశేఖర్, ఆడారి సతీష్‌కుమార్, శివకోటి దుర్గా ప్రసాద్, పిల్లా జగదీష్, మాడెం జోగారావు కార్యక్రమంలో పాల్గొన్నారు.


ఏఎంఏఎల్ కళాశాలకు నాక్ గుర్తింపునకు కృషి

- పూర్వ విద్యార్థుల సమావేశంలో వక్తలు

అనకాపల్లి రూరల్: ఎంతో ఘన చరిత్ర కలిగిన ఏఎంఏఎల్ కళాశాలకు నాక్ గుర్తింపు పొందడానికి పూర్వ విద్యార్థుల సహకారం అవసరమని నాక్ మెంటార్, నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివయ్య అన్నారు. శనివారం స్థానిక కళాశాల సెమినార్ హాల్‌లో జరిగిన పూర్వ విద్యార్థుల సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని కళాశాలకు నాక్ గ్రేడు రావడానికి, కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. 50 ఏళ్లకుపైగా ఎన్నో మైలు రాళ్లను అధిగమించిన ఏఎంఏఎల్ కళాశాలకు నాక్ గుర్తింపు కోసం దరఖాస్తు చేయడంలో ఆలస్యమైందని, ఆ ప్రక్రియను వేగవంతం చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ ప్రక్రియను ప్రారంభించడానికి సమావేశానికి హాజరైన పలువురు పూర్వ విద్యార్థులు రూ.2 లక్షలకు పైగా విరాళాలు అందజేశారు. స్వాతంత్ర్యం రాకముందే అనకాపల్లిలో విద్య, వైద్య సంస్థలు నెలకొల్పి వర్తక సంఘం విశేష కృషి చేసిందన్నారు. ఉత్తరాంధ్రకు చెందిన వేలాది మంది విద్యార్థులు ఇక్కడ ఉన్నత చదువులు పూర్తి చేశారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నాక్ గ్రేడు బట్టి కళాశాల అభివృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల నుంచి ఉన్న పోటీని తట్టుకుని కళాశాలలో ప్రమాణాలు తగ్గకుండా విద్యనందిస్తున్నామని కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు అన్నారు. సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేడ అప్పారావు, కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు, యాజమాన్య కమిటీ ప్రతినిధులు రమేష్, బాలకృష్ణ, సకల గోవిందు, కోశాధికారి వై జగదీశ్వరావు, ఉపాధ్యక్షుడు, సీనియర్ ఆడిటర్ కేఎస్ఎస్ శర్మ, జెడ్పీటీసీ సభ్యుడు పెతకంశెట్టి శివ సత్యనారాయణ జోసెఫ్, ఎస్వీడీఎస్ కార్యదర్శి కర్రి జోగినాయుడు(జిమ్మీ), నాతవరం తహసీల్దార్ సింగంశెట్టి వాసు నాయుడు, జాతీయ అధ్యక్షుడు బుద్ధ కాశీ విశ్వేశ్వరావు, సంఘం ప్రతినిధులు కేఎస్‌వీ సత్యనారాయణ, గుర్రం వరప్రసాద్, పద్మనాభుని రాజేంద్రప్రసాద్, కొణతాల రాజేంద్రప్రసాద్, కే రామచంద్రరావు, కన్నారావు, పెంటాద్రిరావు, వ్యాయామ డైరెక్టర్ డాక్టర్ నాయుడు, కళాశాల సూపరింటెండెంట్ అనూరాధ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివయ్య, వర్తక సంఘం పెద్దలు

శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


దుర్గమాంబ గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న గ్రామ పెద్దలు

పరవాడ: స్థానిక బొంకుల దిబ్బ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శరన్నవరాత్రుల పోస్టర్‌ను శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆదివారం దుర్గమాంబను ప్రతిష్ఠంచి లక్ష దీపారాధన, కలశపూజలు ఉంటాయని చెప్పారు. 9 రోజుల పాటు ఉదయం, సాయంత్రం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 21న మండపం ఆవరణలో భారీ అన్నసమారాధన, 22న మెగా డ్యాన్స్ హంగామా ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, వెన్నలపాలెం సర్పంచ్ వి.అప్పారావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామారావు, ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ చల్లా కనకారావు, పెద్ద చెరువు ఆయకట్టు సంఘ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, నాయకులు పైల హరీష్ పాల్గొన్నారు.

శ్రీ సిద్ధిలింగేశ్వర స్వామి వారి దేవస్థానం

దేవదాయ ధర్మదాయ శాఖ
మెయిన్ రోడ్డు, అనకాపల్లి పట్టణం (దేవాలయం కోడ్: 15701)

టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన (5వ పర్యాయం)

అనకాపల్లి పట్టణం, మెయిన్ రోడ్డులో వేంచేసియున్న శ్రీ సిద్ధిలింగేశ్వర స్వామి వారి దేవస్థానం యొక్క హక్కుభుక్తములో గల షాపింగ్ కాంప్లెక్స్ మెట్ల క్రింద 9X3 అ॥లు కొలతలు గల షాపును అప్పగింత తేదీ నుండి 3 సం॥ల కాల పరిమితికి నెలసరి అద్దె చెల్లించు పద్ధతిపై **తేది 21.10.2023 ఉదయం 10.00 గం॥లకు** దేవదాయ శాఖ అధికారుల సమక్షములో టెండరు కమ్ బహిరంగ వేలం పాట జరుపబడును.

పాట షరతులు

1. పాటలో పాల్గొను వారు రూ. 20,000/-లు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవలెను.
2. టెండరు వేయువారు షాపునకు నెలకు ఎంత అద్దె చెల్లించగలరో వ్రాయుచూ రూ. 20,000/-లు కార్యనిర్వహణాధికారి, శ్రీ సిద్ధిలింగేశ్వర స్వామి వారి దేవస్థానం, అనకాపల్లి వారి పేరున డి.డి. తీసి టెండరుతో జరపరిచి సీల్డు కవరులో టెండరు బాక్సులో వేయవలెను. టెండరు ఫారమ్ 1కి రూ. 200/-లు చెల్లించి దేవస్థానం వద్ద తీసుకొనవలెను.
3. పాట ముగిసిన వెంటనే హెచ్చు పాటదారు హెచ్చు పాట మొత్తం అనగా 12 నెలల అద్దె మొత్తమును సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించి క్రమమైన రశీదు పొందవలెను.
4. ధరావతులు చెల్లించిన పాటదారులు తప్పనిసరిగా పాటలో పాల్గొనవలెను. లేని యెడల ధరావతు సొమ్ము దేవస్థానంనకు ఫర్ఫీట్ చేయబడును.
5. పాటలో పాల్గొను పాటదారు రూ. 1,00,000/-లు విలువ గల సాల్వెన్సీ సర్టిఫికేటు/ బ్యాంకు గ్యారెంటీ ఇవ్వవలెను.

మిగిలిన పాట షరతులు దేవస్థానం కార్యాలయ పనివేళలలో అడిగి తెలుసుకోవచ్చును.

శ్రీ ఎస్. అప్పల నరసింహం (తాతాజీ)
చైర్మన్, ధర్మకర్తల మండలి

ఇట్లు, కార్యనిర్వహణాధికారి
శ్రీ సిద్ధిలింగేశ్వర స్వామి వారి దేవస్థానం, అనకాపల్లి

అనకాపల్లి, తేది: 12.10.2023